సాక్షి ఒడిశా

ఆదివారం । 5 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,60,728లు, బంగారం 300 మిల్లీగ్రాములు, వెండి 138 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రతపై అవగాహన అవసరమని సీఎం మోహన్‌చరణ్ మాఝీ అన్నారు. 8లో



ఉత్కర్ష్ ఒడిశాకు సన్నాహాలు

ఉత్కర్ష్ ఒడిశా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా సన్నాహాలు చేస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

పాఠశాలలో దొంగతనం



బుట్టిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని బుట్టిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దొంగతనం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం పాఠశాల పూర్తయిన అనంతరం పాఠశాల గదులకు తాళంవేసి సిబ్బంది అంతా వెళ్లిపోయారు. అయితే శనివారం ఉదయం స్కూల్‌కు సిబ్బంది చేరుకున్నారు. అనంతరం హెచ్‌ఎం గదిని తెరిచేందుకు వెళ్లే సమయానికే ఆ గది తాళం పగలుగొట్టిన ఆనవాలు ఉన్నాయి. దీంతో ఇతర ఉపాధ్యాయులను పిలిచి చూపించారు. అనంతరం లోపల చూడగా బీరువా తెరిచి ఉంది. అలాగే పేపర్లు చెల్లచెదురుగా పడి ఉన్నాయి. దీంతో వెంటనే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి సమాచారం ఇచ్చారు. అనంతరం మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన అనంతరం ఐఐసీ రీగాన్‌కిండో తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. దీనిలో భాగంగా ముఖ్యమైన రికార్డులు చోరీకి గురైనట్లు నిర్ధారించారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాలు అరికట్టాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

జయపురం: అడవుల్లో అగ్ని ప్రమాదాలను అరికట్టాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక అటవీ విభాగ అధికారి కార్యాలయంలో ఒడిశా ప్రభుత్వ అటవీ పరిరక్షణ జల వాయు పరివర్తన విభాగ అధికారి డా.ప్రతాప్ కుమార్ బెహర అధ్యక్షతన జయపురం అటవీ డివిజన్‌లో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు డివిజన్ స్థాయి అధికారుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా విక్రమదేవ్ వర్సిటీ విజ్ఞాన విభాగ అధ్యాపకుడు ప్రశాంత కుమార్ పాత్రో మాట్లాడుతూ.. అటవీ పర్యావరణం రక్షణ, వన్య జంతువుల రక్షణ, అడవుల విస్తరణ, వాటి పరిరక్షణ మొదలగు విషయాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఏసీఎఫ్‌వో డా.అమిత్ కుమార్ నాయిక్, జయపురం అటవీ విభాగ అధికారి సచ్చిదానంద పారిడ, బొరిగుమ్మ అటవీ అధికారి డొంబురుదొర గొమాంగో, కోట్‌పాడ్ అటవీ అధికారి బిద్యుత్ బిశ్వాస్, కుంద్ర అటవీ అధికారి బి.ఎన్.మండిక, బొయిపరిగుడ అటవీ అధికారి సందీప్ పాణిగ్రాహి, గుప్తేశ్వర అటవీ అధికారి రామచంద్ర నేపక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యక్తిగత కార్యదర్శిగా మనోజ్‌కుమార్



భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కొత్త వ్యక్తిగత కార్యదర్శిగా మనోజ్‌కుమార్ సాహు నియమితులయ్యారు. ఈయన 2006 సంవత్సరపు ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన వ్యక్తి. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

పర్యాటకుల సందడి



గండాహతి జలపాతం

పర్లాకిమిడి: పట్టణానికి దాదాపు 25 కి.మీ దూరంలో రాయఘడ బ్లాక్ గంగాబడ పంచాయతీలో ఉన్న గండాహతి జలపాతం వద్ద పర్యాటకుల సందడి పెరిగింది. అక్కడి వాతావరణం ఆస్వాదించడానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు విచ్చేస్తున్నారు. పర్లాకిమిడి నుంచి ఫారెస్టు జంక్షన్, అడాసింగి మీదుగా గండాహతి చేరుకోవడానికి ఒడిశా ఆర్‌అండ్‌బీ శాఖ మంచి రోడ్డును నిర్మించారు. మందస-మెళియాపుట్టి రోడ్డు మీదుగా కూడా గండాహతి జలపాతాలకు చేరుకోవచ్చు. ఇటీవల గండాహతి జలపాతం వద్ద ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌లు కూడా చేస్తుండటం విశేషం. మహేంద్రగిరి పర్వతాల నుంచి వచ్చే ఈ జలపాతాలు సహజ సిద్ధమైనవి. పర్యాటకులు ఇక్కడ విడిది చేయడానికి ఫారెస్టు శాఖ కాటేజీ కూడా నిర్మించింది. కార్ పార్కింగ్, పిక్నిక్‌లకు అనువుగా ఉన్న ప్రదేశం ఉండటం వల్ల వారాంతపు సెలవుల్లో ఎక్కువ మంది పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు.

కనుల పండువగా..!

ముగిసిన చైతీ ఉత్సవాలు



డొంగిరియా వేషధారణలో స్థానిక కళాకారుల నృత్యం



దేశభక్తి గీత నృత్యం

రాయగడలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో కనుల పండువగా జరుగుతున్న చైతీ ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఈ ఏడాది సుమారు రూ.6 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరిగాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాయగడ జిల్లా టూరిస్టు హబ్‌గా గుర్తింపు పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం ముగింపు వేడుకల్లో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ ఫరూల్ పట్వారీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు పాల్గొన్నారు.

– రాయగడ



చైతీ ఉత్సవ వేదిక ఏరియల్ వ్యూ



డొంగిరియా కొందొ నృత్యం



ఆదివాసీ సాంప్రదాయ నృత్యం



చివరి రోజు స్టాల్స్ వద్ద కిక్కిరిసిన జనం



చైతీలో చిన్నారుల సందడి

సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలి



మండీ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హికక

రాయగడ: మండీల వద్ద రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక అన్నారు. జిల్లాలోని బిసంకటక్ సమితి పరిధి కుముడాబల్లిలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ధాన్యం మండీలను శనివారం ఆయన సందర్శించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సంబంధించి కుముడాబల్లి వద్ద మండీని ఏర్పాటు చేసినప్పటికీ, గత రెండు వారాలుగా రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో వారు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి, పగలు ధాన్యం మండీల వద్ద తమ ధాన్యం బస్తాలు దొంగల పాలవ్వకుండా కాపలాగా ఉంటున్న దీనావస్థలను తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజుల తరబడి రైతుల వద్ద నుంచి ధాన్యం ఎందుకు కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. అయితే ధాన్యం కొనేందుకు మిల్లర్లు ముందుకు రాకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని ల్యాంప్ అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా యంత్రాంగానికి సమాచారం తెలిపి తగు చర్యలు తీసుకుంటామని మండీ నిర్వహిస్తున్న అధికారులు సమాధానం చెప్పినట్లు సమాచారం.

యోగా శిబిరం ప్రారంభం



యోగా శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గుసాని సమితి బెత్తగుడ వద్ద జిల్లా ముఖ్య విద్యాధికారి కార్యాలయంలో శనివారం ఉద్యోగుల యోగా శిబిరాన్ని డీఈవో డా.మాయాధర్ సాహు, పతంజలి యోగా శిబిరం గురువు కోట్ల సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ శిబిరానికి పతంజలి యోగా సభ్యుడు కోట్ల సూరి, ఎ.జగన్నాథ రాజు, సాయి, రవి హాజరయ్యారు. యోగాభ్యాసం ద్వారా మానసిక, శారీరక రుగ్మతలు దూరం అవుతాయన్నారు. కార్యక్రమానికి జిల్లా స్కూల్స్ స్పోర్ట్స్ శిక్షకుడు సురేంద్ర పాత్రో సహకరించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



రైలు పట్టాలపై శర్మ మృతదేహం



రైల్వేస్టేషన్ బయట శర్మ ద్విచక్ర వాహనం

రాయగడ: రైలు కిందపడి ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడు జార్ఖండ్‌కు చెందిన దయానిధి శర్మ(27)గా పోలీసులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన శర్మ గత కొద్ది నెలలుగా అంబొదలలో ఫ్యాబ్రికేషన్ పనులను చేస్తుండేవాడు. శనివారం తెల్లవారుజామున అతడు తన బైక్‌ను రైల్వేస్టేషన్ బయట ఉంచి, అనంతరం ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నిందితులను శిక్షించాలి



సంతాపం తెలుపుతున్న విలేకరులు

మల్కన్‌గిరి: జర్నలిస్టు హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని జర్నలిస్టులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఔమా గురుకుల పాఠశాల అవరణలో విలేకర్ హత్యకు శనివారం సంతాపం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ బిజాపూర్ జిల్లా ఎన్డీటీవీ విలేకర్ ముఖేష్ చంద్రఖార్ హత్యకు గురయ్యారు. దీంతో నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డి.గోపికృష్ణ, రత్నకార్ దాస్, రంజిత్ సాహ, దేబోబ్రత సాన తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల కలకలం

- జాజ్‌పూర్ జిల్లాలో రెచ్చిపోయిన దొంగలు
- నగదు కాజేసేందుకు వచ్చి కాల్పులు
- ఇద్దరు మృతి



బంగారు ఆభరణాల దుకాణం ప్రాంగణంలో గుమిగూడిన జనం



భువనేశ్వర్: నగదు దోచుకునే ప్రయత్నంలో దుండగులు కాల్పులకు పాల్పడి ఇద్దరి ప్రాణాలను బలికొన్న ఘటన జాజ్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. మృతుల్లో ఒకరు పండా అలంకార్ బంగారు ఆభరణాల దుకాణం సిబ్బంది కాగా, మరొక వ్యక్తి ఎలక్ట్రీషియన్‌గా గుర్తించారు. ఈ ఘటన పాణికొయిలీ ప్రాంతం ప్రధాన కూడలిలో శనివారం సంభవించింది. మృతి చెందిన బంగారు దుకాణం సిబ్బంది పొట్ట మరియు నడుంపై గాయాలైనట్లు గుర్తించారు. మరో మృతుడు నీలమాధవ్ పండా కాగా, అతడు విద్యుత్ విభాగం సిబ్బంది. వివరాల్లోకి వెళ్తే.. పండా అలంకార్ అనే బంగారు ఆభరణాల దుకాణం నుంచి నగదు జమ చేసేందుకు ఇద్దరు వ్యక్తులు బయల్దేరారు. వీరి కదలికని పసిగట్టిన ముగ్గురు దుండగులు బైక్ మీద వీరిని వెంబడించారు. ఇంతలో విద్యుత్ విభాగం కార్యాలయం సమీపంలో నిలిచి ఉన్న కారుని దుండగుల బైక్ ఢీకొంది. ఈ ప్రాంగణంలో ఉన్న వ్యక్తి బెంబేలెత్తి కేకలు వేయడంతో ఆయనపై దుండగులు తుపాకీ గురిపెట్టి కాల్చారు. ఈ దాడిలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. సత్వర చికిత్స కోసం తక్షణమే ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఆయన మృతి చెందినట్లు ప్రకటించారు. అనంతరం దుండగులు ముందుకు దూసుకుపోయి బంగారు ఆభరణాల దుకాణం సిబ్బందిపై గురి పెట్టి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దుకాణం సిబ్బంది గాయపడ్డారు. వీరిలో ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేసి జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పారిపోతున్న 3 మంది దుండగుల్లో ఇద్దరిని స్థానికులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికుల దాడిలో దుండగులు గాయపడ్డారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



ఘటనా స్థలంలో ఉద్రిక్తత



పోలీసుల అదుపులో దుండగుడు

సేవా పేపరు మిల్లు కార్మికులకు జీతాలు



సేవా పేపరు మిల్లు

జయపురం: దాదాపు 7 నెలల తర్వాత సేవా పేపరు మిల్లు కార్మికులకు 2024 జూన్ నెల జీతాలు వారి బ్యాంక్ ఖాతాల్లో శుక్రవారం జమయ్యాయి. అయితే ఆ జీతాలు కొత్త కంపెనీ ఏజీటీ పేరుతో జమ కావడం విశేషం. దీంతో మిల్లు కార్మికుల్లో ఆశలు చిగురించాయి. గత 2024 మే 30 నుంచి మదర్ అర్థ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజీటీ అండ్ ఏఐఐ పేరుతో కొత్త బిజినెస్ ట్రాన్స్‌ఫర్ లేదా ఎంవోయూ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తమ జీతాలు కొత్త కంపెనీ పేరుతో జమ కావడం వలన మిల్లు కొత్త కంపెనీ నడిపే అవకాశాలు ఉన్నట్లు కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇక పాత బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐల విషయం ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024 జూలై నుంచి మిల్లులో ఉత్పాదన నిలిచిపోయింది. అప్పటి నుంచి విశ్రాంత కార్మికులతో పాటు పర్మినెంట్ ఉద్యోగులకు జీతాలు లభించటం లేదని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నాయి. కొత్త కంపెనీ ముందుగా వారి బకాయిలు చెల్లించాల్సి ఉంటుందని, అంతే కాకుండా మిల్లును పూర్తిస్థాయిలో నడిపేందుకు చర్యలు చేపట్టాలని కార్మిక వర్గాలు కోరుతున్నాయి.

క్లుప్తంగా

ఘనంగా బ్రెయిలీ దినోత్సవం



మాట్లాడుతున్న డీఎస్ఎస్‌వో సంతోష్ కుమార్ నాయక్

పర్లాకిమిడి: స్థానిక ట్రెజరీ రోడ్డులో ఉన్న సమర్థ్ దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో లూయీ బ్రెయిలీ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అనుప్ పండా మాట్లాడుతూ.. బ్రెయిలీ లిపి వలన పుట్టుకతో అంధులైన ఎంతోమంది అనేక రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. డీఎస్ఎస్‌వో సంతోష్ కుమార్ నాయక్ మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో 3,024 మందికి పైగా అంధులు, దివ్యాంగులు ఉన్నారని, వీరిలో 90 శాతం మందికి శిక్షణ, ఉపకరణములు, ప్రభుత్వ భృతిని అందజేస్తున్నామని తెలిపారు. సైట్ సేవర్స్ ఇండియా సహకారంతో జరిగిన కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, ఉపఖండ సామాజిక సురక్షా అధికారి ఉత్సర్‌గీతా బోడోరయితో, యాక్షన్ ఎయిడ్ దివ్యాంగుల రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ బెహరా, సమర్థ్ దివ్యాంగుల అధ్యక్షుడు సంతోష్ కుమార్ మహారాణా తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి



పీఆర్‌పేట రోడ్డులో పడుతున్న పొగమంచు

జయపురం: పట్టణ పరిసర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. శనివారం 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. పొగమంచు సైతం దట్టంగా అలముకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు




గాయపడిన దేవన్ సాంగి

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో చిత్రకొండ, బలిమెల ప్రధాన రహదారిలో మాంత్రిపూట్ గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాకు చెందిన దేవన్ సాంగికు గాయాలయ్యాయి. దేవన్ సాంగి బైక్‌పై చిత్రకొండ నుంచి బలిమెల వైపు వస్తున్నాడు. అదే సమయంలో బలిమెల నుంచి చిత్రకొండ వైపు వెళ్తున్న టిప్పర్ వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులాల్లో పార్ట్‌టైం ఉద్యోగాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో తామరాపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల కళాశాల (బాలికలు)లో ఖాళీగా ఉన్న హెల్త్ సూపర్‌వైజర్/ స్టాఫ్‌నర్సు పోస్టుల్లో పార్ట్ టైం ప్రాతిపదికన పనిచేసేందుకు మహిళా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ ఎస్.బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్/ జీఎన్ఎం శిక్షణ పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో శ్రీకాకుళంలోని ఆదివారంపేట వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 08942-279926, 9701736862, 9000314209 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ క్రికెట్ పోటీలకు బొడ్డపాడు విద్యార్థి



సాహిల్‌కుమార్ యాదవ్

పలాస: మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాపాక సాహిల్ కుమార్ యాదవ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల పీడీ సీహెచ్ రామ్‌జీ శనివారం తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య తరపున మండల స్థాయి నుంచి అంచెలంచెలు గా ఎదిగి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఉపాధ్యాయు లు అభినందించారు. కార్యక్రమంలో సాహిల్ తల్లిదండ్రులు రాపాక జగదీష్, రమణమ్మలు, ఎస్.ఎం.సి చైర్మన్ గర్తం తులసీరావు, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు తదితర లు పాల్గొన్నారు.

ఉత్కర్ష్ ఒడిశాకు సన్నాహాలు



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: ఉత్కర్ష్ ఒడిశా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పేరొందిన జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు హాజరు కానున్నారు. ఈనెల 28న ఉత్కర్ష్ ఒడిశా కార్యక్రమం ప్రారంభమై, 30వ తేదీ వరకు కొనసాగుతుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ ఏర్పాట్లుని పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝికి సవివరంగా ప్రదర్శించారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని కార్యక్రమాలను అత్యంత ఆకర్షణీయంగా రూపొందించినట్లు పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిలో ఒడిశాకు ప్రత్యేక గుర్తింపును సాధించే లక్ష్యంతో కార్యక్రమం రూపొందిచాలని సూచించారు. ఉత్కర్ష్ ఒడిశా కార్యక్రమం పెట్టుబడిదారులకు ఒడిశాను ఇష్టపడే గమ్యస్థానంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈనెల 27న సమావేశం

ఈనెల 27న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ జాతీయ కార్యనిర్వాహక మండలి సమావేశం జరగనుంది. తదుపరి ఈనెల 28, 29 తేదీల్లో వరుసగా రెండు రోజుల పాటు 4 ప్లీనరీ సమావేశాలు, 16 సెక్టోరల్ సెషన్లు, 4 రౌండ్ టేబుల్ సమావేశాలు జరగనున్నాయి. ఈ రెండు రోజుల్లో దాదాపు 3,000 మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, స్టార్టప్ పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక సంస్థలతో అనుబంధం ఉన్న వ్యక్తులు పాల్గొంటారు. తొలిరోజు ఈ నెల 28న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచ్చేసి కార్యక్రమంలో పాలుపంచుకున్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ రెండు రోజుల్లో పరిశ్రమలోని వివిధ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సెషన్స్, ప్రముఖ పారిశ్రామికవేత్తల ప్రసంగాలు ఉంటాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రముఖ పరిశ్రమల సీఈవోలతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. ఒడియా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక సెషన్, మహిళా వ్యాపారవేత్తలకు ప్రత్యేక సెషన్స్ కూడా జరుగుతాయి. దీనితో పాటు ఒడియా మహిళా పారిశ్రామికవేత్తల కోసం 'సుభద్ర ముద్ర' పేరుతో ప్రత్యేక సెషన్ కూడా జరగనుంది. ఈ కార్యక్రమం ఆరంభం నంచి జనవరి 28 నుంచి 30 వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు అవుతుంది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ చంద్ర స్వంయి, అభివృద్ధి కమిషనర్ అను గర్గ్, ముఖ్యమంత్రి అదనపు ప్రముఖ కార్యదర్శి సెక్రటరీ నికుంజ్ బిహారీ ధొలా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ సురేంద్ర కుమార్ మరియు వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు మరియు సెక్రటరీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తిరుప్పావై సేవ



వట్టివేళ్ల అలంకరణలో వేంకటేశ్వరుడు



తిరుప్పావై సేవలో కోనేటి రాయుడు

ధనుర్మాసం పురస్కరించుకొని స్థానిక కేవుటి వీధిలో ఉన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో తిరుప్పావై సేవను శనివారం ఉదయం జరిపించారు. ప్రధాన అచార్యులు అనుమంచుపల్లి రాజగోపాలచారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరగగా, సుమారు 71 కిలోల తిరుప్పావడ (పులిహోరం)తో స్వామి వారిని అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే స్వామివారు 20వ రోజు వట్టివేళ్ల అలంకరణలో దర్శనమిచ్చారు.

పర్లాకిమిడి

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



జాతీయ రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించిన సీఎం మోహన్ చరణ్ మాఝి

- సీఎం మోహన్‌చరణ్ మాఝి
- జాతీయ రహదారి భద్రతా మాసం ప్రారంభం



ర్యాలీ జెర్సీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రతపై అవగాహన అవసరమని సీఎం మోహన్‌చరణ్ మాఝి అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారి భద్రత మాసం శనివారం ఆరంభమైంది. దీనిలో భాగంగా మాస్టర్ క్యాంటిన్ స్క్వేర్ నుంచి రామమందిర్ స్క్వేర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ ఏడాది భద్రతా మాసం నినాదం 'ఇంటికి క్షేమంగా చేరండి' అని పేర్కొన్నారు. మాస్టర్ క్యాంటిన్ స్క్వేర్ నుంచి రామమందిర్ స్క్వేర్ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, డ్రైవర్లు, కళాకారులు, ప్రభుత్వ అధికారులతో సహా వివిధ సమూహాల నుంచి ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను శ్రద్ధగా పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, వాణిజ్య శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా, గృహ నిర్మాణం, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణచంద్ర మహాపాత్రో, భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) మేయర్ సులోచన దాస్, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) యోగేష్ బహదూర్ ఖురానియా, రవాణా శాఖ కమిషనర్ అమితాబ్ ఠాకూర్, భువనేశ్వర్ అభివృద్ధి సంస్థ తిరుమల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు సాయం



ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులు పింఛన్ కోసం ఏటా అందజేయాల్సిన లైఫ్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేస్తున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు రోణంకి రామచంద్రరావు, అంకం ధర్మారావు, ఎస్.వి.రమణ, పి.శాంతారాం, దొంతం పార్వతీశం తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు కార్యక్రమం కొనసాగిస్తామని చెప్పారు. ఈ నెల 21 నుంచి 28 వరకు శ్రీకాకుళం ఎన్జీవో హోమ్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆధార్, పీపీవో, బ్యాంకు ఖాతా, బ్రాంచి, ఫోన్ నంబర్లను తీసుకురావాలని, పూర్తి వివరాలకు 8341275557, 8555919837 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రైళ్లలో గొలుసు దొంగతనాలు

- డిగ్రీ విద్యార్థిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ : రైళ్లలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న డిగ్రీ విద్యార్థిని అరెస్ట్ చేసి విశాఖ కోర్టుకు తరలిస్తున్నట్లు విశాఖపట్నం జీఆర్‌పీ లైన్స్ సీఐ రవికుమార్ తెలిపారు. పలాస రైల్వేస్టేషన్‌లో శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన ఈరగట్టపు రాము నరసన్నపేటలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ తృతీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. దురలవాట్లకు బానిసయ్యాడు. డబ్బు కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. పలాస నుంచి విశాఖ వెళ్లే రైళ్లలో ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్ చేస్తూ వారి వద్ద బంగారు గొలుసులను అపహరిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ విద్యార్థిపై గతంలో పోలాకి పోలీసుస్టేషన్ పరిధిలో వైన్ షాప్ దొంగతనం కేసు కూడా ఉంది. పలాస జీఆర్‌పీ స్టేషన్ పరిధిలో మూడు కేసులకు సంబంధించి 35 గ్రాముల బంగారు పుస్తెలతాడు, 35 గ్రాముల మంగళసూత్రం, 3 తూలాల మంగళ సూత్రం చోరీకి గురికాగా.. ఇందులో రెండు వస్తువులు రికవరీ చేశారు. 35 గ్రాముల మంగళసూత్రం రికవరీ చేయాల్సి ఉందని సీఐ తెలిపారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



బారువ జూనియర్ కాలేజీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ అశోక్

సోంపేట: మండలంలోని బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు. అనంతరం పలాసపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తండ్రి ద్వారా పారాకత్తులతో సంక్రమించే వారసత్వ భూములకు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కేవలం పారాకత్తులు రాసి ఇస్తే రికార్డుల్లో నమోదు చేయడం కుదరదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్, పలాస ఆర్డీఓ వెంకటేష్, తహశీల్దార్ అప్పలస్వామి, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఓ కార్యాలయం ఆరా



వరి కుప్పలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నరసన్నపేట: ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో వేసిన వరి కుప్పలు తడిచిపోయాయి. దీనిపై సాక్షిలో 'ఆరని తడి.. అన్నదాత కంట తడి' అనే శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అమరావతిలోని సీఎంఓ కార్యాలయం స్పందించి జిల్లాలో పరిస్థితిపై ఆరా తీసింది. కలెక్టర్‌కు సమాచారం రావడంతో ఆయన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి ఆదేశాల మేరకు నరసన్నపేట వ్యవసాయాధికారి సునీత పొలంలో ఉన్న వరి కుప్పలను శనివారం పరిశీలించారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపామని చెప్పారు.

సుడా గ్రీవెన్స్‌సెల్ రేపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు ఈ నెల 6న గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నట్లు సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ లేఔట్లు వేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. సుడా కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి 8639666590 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య వివరించవచ్చని తెలిపారు.

చిరంజీవికి రైతునేస్తం పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రైతు చిరంజీవి

ఆమదాలవలస: మండలంలోని నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయం రైతు నక్క చిరంజీవికి ఉత్తమ ప్రకృతి వ్యవసాయ అభ్యుదయ రైతునేస్తం పురస్కారం లభించింది. శనివారం గుంటూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో భాగంగా మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ప్రకృతి వ్యవసా యం విధానంలోనే పంటలు సాగు చేస్తున్నాన ని చెప్పారు. తనకు ఇంతటి గుర్తింపు రావడాని కి కారణమైన డీపీఎం రేవతికి కృతజ్ఞతలు తెలిపారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం బైపాస్ కూడలి సమీపంలో జాతీయ రహదారిపై శ్రీకాకుళం వైపు వెళుతున్న పశువుల అక్రమ రవాణా వాహనాన్ని శుక్రవారం రాత్రి ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వి.సందీప్‌కుమార్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశారు. ఎనిమిది ఆవులు, నాలుగు దూడలను విశాఖలోని కొత్తవలస గోశాలకు తరలించారు. జాతీయ రహదారిపై పశువుల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన దుబ్బ చంద్రయ్య(53) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రయ్య రోజువారి కూలీ పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించవద్దని కుటుంబ సభ్యులు చెప్పడంతో వారికి అడ్డు చెబుతూ శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే తన గదిలోకి వెళ్లి పోయాడు. కుమారుడు తేజేశ్వర్, కోడలు వేరే గదిలో నిద్రపోయారు. భార్య శ్రీదేవి పలాసలోని పుట్టింట్లో ఉంది. శనివారం ఉదయం ఎంతసేపటికి చంద్రయ్య గది తెరవకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు తెరిచారు. ఫ్యాన్‌కు చంద్రయ్య మృతదేహం వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జిన్నారావు తెలిపారు.

క్వారీ నిర్వహణతో ఇబ్బందులు



ఖాసీంఖాన్ గ్రానైట్ క్వారీపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్న మైన్స్ అధికారులు

టెక్కలి: గ్రామానికి ఆనుకుని క్వారీ నిర్వహణతో గ్రామస్తులమంతా అనేక ఇబ్బందులు పడుతున్నామని సన్యాసినీలాపురం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాసీంఖాన్ గ్రానైట్ క్వారీపై గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు రోజుల కిందట మైనింగ్ అధికారులు గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. గ్రామానికి ఆనుకుని క్వారీ నిర్వహిస్తుండడం వల్ల గతంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ ప్రస్తుతం బ్లాస్టింగ్‌లు చేయడంతో రాళ్లు ఇళ్లపై పడి భయాందోళన కలిగిస్తున్నాయని, అలాగే రాత్రి వేళల్లో ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నామని విచారణలో అధికారులకు వివరించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలను అధికారులు నమోదు చేశారు. దీనిపై మైన్స్ ఏడీ విజయలక్ష్మి వద్ద ప్రస్తావించగా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కింది స్థాయి సిబ్బంది విచారణ చేశారని పూర్తి వివరాలతో అధికారులకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ స్కీమ్‌ను స్కామ్ చేయనున్నారు

- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: పేద ప్రజలకు సంజీవనిగా నిలిచిన ఆరోగ్యశ్రీ పథకం ఇకపై ప్రైవేటు పరం చేయనున్నారని, స్కీమ్‌ను స్కామ్ చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని దేశమంతా కొనియాడిందని, అలాంటి పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్‌గా సేవలు అందిస్తోందని చెప్పారు. ఇప్పుడు ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం స్కామ్ చేయడానికి విధి విధానాలను మార్చుకుంటూ వచ్చిందని అన్నారు. ట్రస్ట్ పరిధిలో ఉన్న ఆరోగ్యశ్రీని ప్రైవేటు ఇన్స్యూరెన్సు కంపెనీల చేతుల్లో పెడుతోందన్నారు. ఆ కంపెనీలు కూడా వారి అనుయాయులవేనని, ఆ డబ్బంతా తిరిగి చంద్రబాబు చేబులోకి చేరేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ విధానంతో ప్రజలకు మంచి జరగబోదని తెలిపారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో రూ.13,421 కోట్లు చెల్లించిందని అందులో రూ.780 కోట్లు కోవిడ్ సేవలకు ఉపయోగించారని గుర్తు చేశారు. మిగిలిన రూ.12,671 కోట్లలో సుమారుగా ఏడాదికి రూ.2,535 కోట్ల చెల్లింపులు జరిగాయని అన్నారు. అది కూడా రూ.5లక్షల ఆదాయంలో ఉన్నవారికి 1.43 లక్షల కుటుంబాలకు సేవలు అందాయని అన్నారు. రూ.25 లక్షల వరకూ వైద్య సేవలు, హైదరాబాద్, చెన్నై, బెంగళూర్‌లో 72 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సైతం అవకాశం కల్పించామని అన్నారు. ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇప్పుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 1.43 లక్షల కుటుంబాలకు రూ.రెండున్నర లక్షలు సేవలు అందుతాయని అన్నారని, అవికూడా ఏడాదికి రూ.2500లు ప్రీమియం కడితే రాష్ట్ర వ్యాప్తంగా రూ.3571 కోట్ల నిధులతో సేవలు అందిస్తామని అంటున్నారని అన్నారు. అంటే అదనంగా ఏడాదికి రూ.1040 కోట్లు ఖర్చు చేస్తున్నారని అవి ఎక్కడికి చేర్చడానికో చెప్పాలన్నారు. ఏ ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తారో వెల్లడించాలని అన్నారు. అది సత్యకుమార్‌దా, మంగళగిరి కంపెనీలదా చెప్పాలన్నారు.

బడ్జెట్ మీద లోడ్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, అన్నీ లెక్కలేస్తే సుమారు రూ.5800 కోట్లు తేడా వస్తుందని ఈ అదనం ఎవరికి ఇస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బొమ్మ కనిపిస్తోంది తప్ప అంతా మంగళగిరి నుంచి ఆపరేటింగ్ జరుగుతోందని అన్నారు. పవన్ కల్యాణ్ ఈ విషయంపై చంద్రబాబును ప్రశ్నించాలన్నారు. గతంలో స్కిల్‌డెవలప్‌మెంట్ స్కీమ్ స్కామ్ చేసినట్లు మళ్లీ సిద్ధమయ్యారని అన్నారు. హైబ్రీడ్ మోడల్ ఆరోగ్యశ్రీ ప్రైవేటు పరం చేయడానికి తప్ప ప్రజలకు, ప్రభుత్వానికి ఉపయోగం లేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో వైద్యవ్యవస్థను పటిష్టం చేశారని, ఇప్పుడు అన్నీ ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు. ఆరు నెలల్లో ఆరోగ్యశ్రీలో 3వేల బిల్లులు పెండింగ్ చేశారని ఈనెల 16 నుంచి సేవలు నిలిచిపోనున్నాయని అన్నారు.

అరకూరగా వడ్డింపు!



రెండు కేజీల బంగాళదుంప కూర ఎంత మందికి సరిపోతుంది? మహా అయితే ఇరవై మందికి. అయితే అక్షయపాత్ర సంస్థ నిర్వాహకుల దృష్టిలో మాత్రం 120 మంది విద్యార్థులకు సరిపోతుందట. గార మండలం అంపోలు పంచాయతీ లింగాలవలస ప్రాథమికోన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు వడ్డించేందుకు శనివారం రెండు కేజీల బంగాళదుంప కూర మాత్రమే పంపించడంతో నిర్వాహకులు తలలు పట్టుకున్నారు. కొద్ది మందికే కూర దక్కగా, మిగిలిన వారంతా సాంబారు అన్నంతోనే సరిపెట్టుకున్నారు. తక్కువ కూర రావడంతో నిర్వాహకులు సీఆర్ఎంటీ రాములమ్మకు సమాచారమందించారు.

– గార

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యంతో పట్టుబడ్డ ఆటో

పార్వతీపురం: అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు శనివారం పట్టుకున్నారు. పరశురాంపురం నుంచి అలమండ ఆటోలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా అడ్డూరువలస వద్ద తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. దీనికి సంబంధించి సివిల్ సప్లై ఉప తహసీల్దార్ ఎం.రాజేంద్ర తెలిపిన వివరాలు.. పరశురాంపురానికి చెందిన ఎం.లక్ష్మణరావుకు చెందిన బియ్యం కొత్తూరుకు చెందిన కె.శివ ఆటోలో పరశురాంపురం నుంచి అడ్డూరువలస మీదుగా అలమండ తరలిస్తుండగా 4.5 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నామన్నారు. బియ్యాన్ని 16వ నెంబర్ అర్బన్ షాపునకు అప్పజెప్పామని తెలిపారు. అలాగే ఆటోను పార్వతీపురం రూరల్ స్టేషన్‌లో ఉంచామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఎ.కామేశ్వరరావు పాల్గొన్నారు.

మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన అసిరియ్య

వీరఘట్టం: స్థానిక కస్పా వీధికి చెందిన అసిరియ్య(60) అనే వ్యక్తి మురుగు కాల్వలో పడి మృతి చెందాడు. వీరఘట్టం బీఎంఆర్ థియేటర్ రోడ్డులో శుక్రవారం తిరిగాడిన ఈ వ్యక్తి శనివారం తెల్లవారే సరికి మురుగు కాల్వలో శవమై తేలాడు. అర్ధరాత్రి వేళ మద్యం మత్తులో కాల్వలో పడిపోవడంతో ఎవరూ గమనించకపోవడంతో ఈ దుర్ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాల్వలో అధికంగా మురుగునీరు నిల్వ ఉండడం వల్ల ఆ నీరు తాగి ఊపిరాడక మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలియడంతో స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. అతని మృతిపై తమకు ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలపడంతో మృతదేహాన్ని వారికి అప్పగించారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన గండి గుంపస్వామి



చికిత్స పొందుతున్న సీహెచ్ సింహాద్రి, సీహెచ్ కుమార్

పార్వతీపురం టౌన్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పార్వతీపురం పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ గోవింద్ తెలిపిన వివరాలిలా వున్నాయి. పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామానికి చెందిన గండి గుంపస్వామి(72) పట్టణంలోని ఆస్పత్రి పని ముగించుకొని తిరిగి వెళ్తుండగా బెలగాం గెడ్డవీధి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతి చెందారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనంపై ఉన్న మెంటాడ మండలానికి చెందిన సీహెచ్ సింహాద్రి, సీహెచ్ కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు 323 మంది హాజరు



పరుగు పందెంలో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

విజయనగరం క్రైమ్: పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్ నియామక ప్రక్రియలో భాగంగా శనివారం నిర్వహించిన పీఎంటీ, పీఈటీ పరీక్షలలో 550 మంది మహిళా అభ్యర్థులకుగానూ 323 మంది మాత్రమే హాజరయ్యాయరని ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. వేకువజామున 5 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభమైన ప్రక్రియను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, అధికారులు స్వయంగా పర్యవేక్షణ చేసి హాజరైన అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. నియామక ప్రక్రియలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు యూనివర్స్, ఎం.వీరకుమార్, ఎస్.బాపూజీ, టిఎస్.శ్రీనివాసరావు, కె.థామస్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల నిరసన ఉద్రిక్తం

- అండగా వైఎస్సార్‌సీపీ
- కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదు..
- వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమ కార్మికుల నిరసన ర్యాలీ, మానవహారం
- జైల్లో పెడతారా.. పెట్టండి : మాజీ ఎంపీ బెల్లాన



మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ



నిరసన ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న కార్మికులు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: 'కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా.. ఒప్పందం ప్రకారం నూతన వేతనం అమలు చేయాల్సిన యాజమాన్యం మొండి వైఖరి అవలంభిస్తోంది... నిరవధిక సమ్మెతో కార్మికులు రోడ్డున పడ్డారు... కార్మికుల పక్షాన నిలవాల్సిన ప్రభుత్వం, పోలీసులు పరిశ్రమ యాజమాన్యానికి కొమ్ము కాస్తున్నాయి.. చర్చల పేరుతో ఎన్నాళ్లు కాలయాపన చేస్తారు... కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు ప్రజలకు తెలియాలనే నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు.. అందుకు అవకాశం ఇవ్వం.. అరెస్టులు చేస్తాం.. జైల్లో పెడతామంటే సిద్ధంగా ఉన్నామని జైల్లో పెడితే పెట్టండని' మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పోలీసులను ప్రశ్నించారు. మండలంలోని కర్లాంలో ఉన్న శ్రీ వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమ కార్మికులు నూతన వేతన ఒప్పందం అమలు కోరుతూ సీఐటీయూ రాష్ట్ర నాయకుడు టివి.రమణ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ మూడు రోడ్ల జంక్షన్, మెయిన్‌రోడ్, గాంధీబొమ్మ జంక్షన్ నుంచి తిరిగి మూడు రోడ్ల జంక్షన్‌కు చేరుకుని, అక్కడ విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమానికి మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిరసన త్వరగా ముగించాలని కార్మికులకు సీఐ జి.శంకరరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావు సూచిస్తున్న సమయంలో కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ స్పష్టం చేశారు. యాజమాన్యం దిగి రాకపోతే పోరాటం చేస్తామని చెప్పారు. ఈ సమయంలో సీఐ జోక్యం చేసుకుని ఈ నెల 7న కార్మిక శాఖ అధికారుల సమక్షంలో చర్చలు ఉన్నందున అప్పటి వరకు ఓపిక పట్టాలని సూచించారు. దాంతో శాంతించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో కార్మికులకు బోనస్, నూతన వేతనం

వైఎస్సార్‌సీపీ హయాంలో వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమలో కార్మికులకు బోనస్‌తో పాటు నూతన వేతనం అమలు జరిగేలా యాజమాన్యంతో మాట్లాడి చర్యలు చేపట్టామని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 2023 – 24 సంవత్సరంలో కార్మికులకు సంక్రాంతి పండగకు రూ.10 వేలు చొప్పున బోనస్‌తో బాటు రూ.2 వేలు నూతన వేతనం అదనంగా చెల్లింపులు జరిగాయన్నారు. అదే సమయంలో వేతన ఒప్పందంపై కార్మికులు, యాజమాన్యం మధ్య ఒప్పందం కూడా జరిగినప్పటికీ ప్రస్తుతం ఆ ఒప్పందం అమలు చేయడంలో యాజమాన్యం మొండి వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. ఒడిశా కార్మికులను తీసుకొచ్చి వారితో పని చేయించుకుంటే స్థానికంగా ఉన్న కార్మికుల సంగతి ఏంటని ప్రశ్నించారు.

యాజమాన్యం తీరు సరికాదు..

పౌల్ట్రీ పరిశ్రమల్లో కార్మికులకు, ఇతర పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు చాలా వ్యత్యాసం ఉందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పౌల్ట్రీ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉండే కార్మికులపై కోళ్ల వ్యర్థాలు పడుతూనే ఉంటాయన్నారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులకు భోజన సమయంలో చేతులు శుభ్రం చేసుకునేందుకు యాజమాన్యం కనీసం సబ్బులు కూడా ఇవ్వడం లేదన్నారు. పరిశ్రమ చుట్టూ ఉన్న గ్రామాలను అభివృద్ధి చేస్తామని చెప్పిన యాజమాన్యం కనీసం పట్టించుకోలేదని గుర్తు చేసారు. దుర్వాసనతో పరిశ్రమ ఎత్తేయాలని గతంలో ప్రజలు ఆందోళన చేస్తే రూ.వందల కోట్లు పెట్టిన యాజమాన్యం నష్టపోకూడదనే తామంతా ప్రజలకు నచ్చజెప్పి పరిశ్రమ మనుగడకు పూర్తి సహాయ, సహకారాలు అందజేసామన్నారు.

విజయనగరం వేదికగా క్రెడయ్ ప్రోపర్టీ షో



క్రెడయ్ కార్యాలయంలో 5వ ప్రోపర్టీ షోకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్రెడయ్ సభ్యులు

- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే షోలో 100 స్టాల్స్
- క్రెడయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాష్‌చంద్రబోష్

విజయనగరం: నిర్మాణ రంగంలో వినియోగదారులను పూర్తి స్థాయిలో సంతృప్తిపరిచే క్రెడయ్ విజయనగరం చాప్టర్ ఆధ్వర్యంలో ప్రోపర్టీ షో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాష్ చంద్రబోష్ తెలిపారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు విజయనగరంలోని రింగ్ రోడ్ లీ పేరడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఈ షో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ధర్మపురి ప్రాంతంలో క్రెడయ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రోపర్టీ వివరాలను వెల్లడించారు. క్రెడయ్ విజయనగరం చాప్టర్ ఆధ్వర్యంలో 5వసారి నిర్వహించే షోకు అనూహ్య స్పందన లభిండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. షో నిర్వహణకు ఏర్పాటు చేసిన 100 స్టాల్స్ ఏర్పాటుకు నిర్వాహకులు ముందుకు రావటమే ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. ప్రోపర్టీ షోలో నిర్మాణ రంగానికి సంబంధించి ఇంటీరియర్స్, ఫర్నీచర్, ఆటోమొబైల్స్, లిఫ్ట్స్, జనరేటర్, డూప్లెక్స్ విల్లాస్, లే అవుట్ ప్లాట్స్‌తో పాటు వీఎంఆర్‌డీఏకు చెందిన స్థలాలు అందుబాటులో ఉంటా యని వివరించారు. అంతేకాకుండా సోలార్ పరికరాలు, డోర్స్, స్టీల్స్, హార్డ్‌వేర్, పీవీసీ పైపులు, టైల్స్, ఫ్లోరింగ్ మెటీరియల్స్‌కు సంబంధించిన స్టాల్స్‌లో విని యోగదారులకు తమకిష్టమైన వాటిని ఎన్నుకోవచ్చని తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన వీఎంఆర్‌డీఏ ఆ ధ్వర్యంలో స్థలాలు అందుబాటులోకి ఉంచటం ప్రత్యేకతగా పేర్కొన్నారు. షోకు వచ్చే వారిలో లక్కీ విజేతలకు మూడు ఆకర్షణీయమైన బహుమతులు ప్రధానం చేయనున్నట్టు తెలిపారు. ఆది వారం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే పి.అదితిగజపతిరాజు చేతుల మీదుగా ప్రోపర్టీ షో ప్రారంభమవుతుందని వివరించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న విజయనగరంలో నూతనంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, గృహోపకరణాలు కొనుగోలు చేయదలచుకున్న వారికి ఈ షో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. గతంలో నిర్వహించిన ప్రదర్శనలకు దీటుగా 2025 ప్రోపర్టీ నిలుస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రెడయ్ విజయనగరం చాప్టర్ చైర్మన్ వి.పార్థసారథి, అధ్యక్షుడు సిహెచ్.సూర్యనారాయరా జు, కార్యదర్శి కె.రాజశేఖర్, కోశాధికారి జిబి.అనిల్‌కుమార్, మాజీ చైర్మన్ చెరుకూరి శ్రీధర్, సభ్యులు కె.స్వామి, వి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా జిల్లా యువజన ఉత్సవాలు



గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: జిల్లా యువజన ఉత్సవాలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వేడుకగా జరిగాయి. యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. విద్యార్థులు రూపకల్పన చేసిన విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న సెట్విజ్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి బి.రామ్‌గోపాల్ మాట్లాడుతూ జానపద గీతాలు, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, విద్యా వైజ్ఞానిక శాస్త్ర ప్రదర్శన వంటి పోటీలు ఈ ఉత్సవాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన తొలి విజేతలు రాష్ట్ర స్థాయికి వెళ్తారని, ఈ అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలని కోరారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వీటిని ప్రారంభిస్తూ మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ స్థాయిలో జరిగే యువజన ఉత్సవాల్లో జిల్లా విద్యార్థులు పోటీ పడాలన్నారు. న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే జిల్లా విద్యార్థులకు తాను నిధులు సమకూరుస్తానని చెప్పారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా యువజన సంక్షేమ అధికారి కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ యువత వివిధ విభాగాల ద్వారా ఈ ఉత్సవాల్లో పాల్గొనేలా అవకాశం కల్పించామన్నారు. ఇక్కడ ప్రదర్శించిన విభాగాల్లో విజేతలను ఎంపిక చేసేందుకు 19 మంది న్యాయ నిర్ణేతలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన ప్రథమ స్థానం విజేతలను రాష్ట్ర స్థాయికి, అందులో గెలుపొందిన వారికి జాతీయ స్థాయి పంపనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన థింసా నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు, ఎంఈఓలు విమల కుమారి, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు శివనారాయణ, తహసీల్దారు వై.జయలక్ష్మి, ఎంపీడీఓ కె.రూపేశ్, ఎన్ఎస్ఎస్ పీఓ టి.రవికుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురం టౌన్: సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం మెగా జాబ్ మేళా జరగనుందని, నిరుద్యోగ యువత దీన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకుని 18 – 28 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ యువకుల కోసం జనవరి 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్ప్ మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్‌మేళాలో 25 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు బయోడేటా, ఆధార్ కా ర్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరిగే ప్రదేశంలో హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో వివరించారు. వివరాలకు 94947 77553, 73825 59022 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

- చోరీ సొత్తు స్వాధీనం
- 18 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం

విజయనగరం క్రైమ్: స్థానిక కాళీఘాట్ కాలనీలో ఒక ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 18 తులాల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. డిసెంబరు 24న ఉదయం 11 గంటల సమయంలో కాళీఘాట్ కాలనీలో నివాసం ఉంటున్న కొట్టక్కి జగన్మోహనరావు టైలరింగ్ షాపునకు వెళ్లగా, అతని భార్య కూడా ఇంటికి తాళం వేయకుండా గాజులు కొనుగోలు చేసేందుకుగానూ దగ్గరలోని గాజులషాపునకు వెళ్లిందని తెలిపారు. ఈ సమయంలో గుర్తు తెలియని ఒక మహిళ వీధిలో బెలూన్లను విక్రయిస్తూ, తలుపు వేయకుండా ఉన్న ఫిర్యాది ఇంట్లోకి ప్రవేశించి 18 తులాల బంగారు వస్తువులను దొంగలించుకుపోయినట్లు తెలిపారు. బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టి కేసును త్వరితగతిన కొలిక్కి తీసుకువచ్చామన్నారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన వన్‌టౌన్ పోలీసులు చోరీకి పాల్పడిన వారు ఝార్ఖండ్‌కి చెందిన వ్యక్తులుగా ప్రాథమికంగా గుర్తించారు. కచ్చితమైన సమాచారంతో దొంగతనానికి పాల్పడిన ఝార్ఖండ్ రాష్ట్రం టాటానగర్‌కి చెందిన నేహ సబర్ అలియాస్ నేహ జానీ అనే 21 ఏళ్ల మహిళ, ఆమె భర్త సరోజ్ జానీ, అలియాస్ సోబర్‌లను అరెస్టు చేసి, వారి నుంచి చోరీకి పాల్పడిన 18 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేసులో నిందితులను అరెస్టు చేయడంలోనూ, చోరీ సొత్తును రికవరీ చేయడంలో క్రియాశీలకంగా పని చేసిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐలు వివిఎల్.ప్రసన్నకుమార్, కానిస్టేబుల్లు ఎన్.గౌరీశంకర్, టి.శ్రీనివాస్, కె.సన్యాసినాయుడు, మహిళా కానిస్టేబుల్స్ కె.మంగమ్మ, షేక్ మీరాబిలను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సీఐలు, అధికారులు పాల్గొన్నారు. వీధుల్లో బెలూన్లు అమ్ముతూ, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు.

హైబ్రిడ్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ



ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కోడా చలపతిరావు

పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కోడా చలపతిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 7, 8, 10 తేదీల్లో మూడు రోజుల పాటు పార్వతీపురం, పాలకొండ డివిజన్ కార్యాలయాలలో హైబ్రిడ్ విధానంలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఆయన చెప్పారు. జనవరి 7, 8 తేదీలలో విజయవాడ బృందావన్ కాలనీ 2ఎ' కన్వెన్షన్ సెంటర్ నుండి జనవరి 10వ తేదీన కర్నూలు కమిషన్ ఆఫీస్ నుండి ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతి రోజు అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తుందన్నారు. ఈ ధరలపై సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులు పాల్గొనవచ్చునన్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్‌కు స్థానిక విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయములో ఎస్ఈ ఆఫీస్ లేదా ఏదైనా విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో ఈ.ఈ. ఆఫీస్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. ప్రతి రోజు ముందుగా నమోదు చేసుకున్న వినియోగదారుల అభ్యంతరాలు విన్న తరువాత విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో నమోదు చేసుకొని వినియోగదారుల అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని ఆయన వివరించారు.

పరిశోధనా దృక్పథాన్ని మెరుగుపరుచుకోవాలి

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: అకడమిక్ ఎక్సలెన్స్‌తో పాటు పరిశోధనా దృక్పథాన్ని విద్యార్థులు నిరంతరం మెరుగుపరుచుకోవాలని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. యూనివర్సిటీలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'ఫార్మా ఎసెన్షియల్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి వక్తలుగా హాజరయిన ఫార్మా స్యూటికల్స్ డిప్యూటీ హెడ్ డాక్టర్ అనిల్ ఎస్ ఖలే, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్‌వీ రమణలతో కలిసి తొలిత జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యతతో కూడిన కెరీర్ కోసం కమ్యూనికేషన్ స్కిల్స్, డొమైన్ నిర్దిష్ట నైపుణ్యం రెండింటినీ అభివృద్ధి చేయడం ఎంతైనా అవసరమని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్‌గా కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ముక్కామల శరత్‌చంద్రబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కలిదిండి సురేష్‌బాబు, డాక్టర్ పడలా కిషోర్ నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహిని శ్రీనివాసన్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్ రంగం కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: మోటార్ రంగంలో ఉన్నటువంటి అన్ని వర్గాల కార్మికులకు కేంద్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ ఆల్ ఇండియా కార్యదర్శి లక్ష్మయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా పట్టణంలో లారీ ఓనర్స్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు గొర్లె మాధవరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధర ప్రస్తుతం 73 డాలర్లకు తగ్గినప్పటికీ, దేశంలో డీజిల్ ధర పెరుగుతూనే ఉందని అన్నారు. 2017లో సెస్ మూడు రుపాయిలు ఉండగా నేడు ఎనిమిది రుపాయిలకు పెరిగిందని తెలిపారు. బీమా ప్రీమియం పెంచుకుంటూ వెళ్లడం వలన మోటార్ రంగాన్ని మరింత కుదేలు చేస్తుందని విమర్శించారు. ప్రస్తుతం రోడ్ సెస్ వసూలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు టోల్ గేట్లు ద్వారా మోటార్ రంగాన్ని మరింత తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వాపోయారు. విజయవాడ తరువాత సాలూరులో మోటార్ రంగంపై స్థిరపడిన కార్మిక వర్గం ఎక్కువగా ఉన్నా.. ప్రత్యేకమైన నిధులు ఇచ్చి మోటార్ కార్మికులను, యజమానులను ఆదుకునే ప్రయత్నం జిల్లా యంత్రాంగం చేయలేదని వాపోయారు. మోటార్ రంగ కార్మికులను ఆదుకునేందుకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులను కేంద్రాలకు పంపించండి..

విజయనగరం ఫోర్ట్: మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ అన్నారు. అయ్యన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆట, పాటల విద్యతో పిల్లల్లో మానసికంగా బలోపేతమవుతారని చెప్పారు.

సీసీ కెమెరాల నిఘాలో వీరఘట్టం..

- పట్టణం చుట్టూ 50 కెమెరాల ఏర్పాటు
- నేరాల నియంత్రణకు ఉపయోగపడతాయి : పోలీసులు



వీరఘట్టంలో తన షాపు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసులకు చూపిస్తున్న వ్యాపారస్తుడు(ఫైల్)

వీరఘట్టం: పట్టణంలో ఎక్కడ ఏ దొంగతనం జరిగినా, తగాదా జరిగినా, ఆరుబయట మద్యం సేవించినా, మద్యం దుకాణాల వద్ద గలాటా చేసినా ఇట్టే కనిపెట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేసేందుకు వీరఘట్టం పట్టణం చుట్టూ ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. వీరఘట్టం ప్రధాన రహదారిలో అంబేడ్కర్ జంక్షన్, తెలగవీధి జంక్షన్, గ్రోమోర్ జంక్షన్, స్టేట్‌బ్యాంక్ జంక్షన్, కాలేజీ సెంటర్‌తో పాటు ప్రగతి, మహర్షి హైస్కూల్స్ సమీపంలో, బీఎంఆర్ థియేటర్, టింబర్ డిపో, సీబీఎం వీధి, కిమ్మి రోడ్డు.. ఇలా వీరఘట్టం పట్టణానికి నలుమూలలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

50 కెమెరాల ఏర్పాటు..

దొంగతనాలను అరికట్టేందుకు, అనుమానాస్ప ద వ్యక్తులను గుర్తించేందుకు వీరఘట్టం మేజర్ పంచాయతీలోని ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపారులంతా తమ షాపుల వద్ద సీసీ కెమెరా లు ఏర్పాటు చేసుకోవాలని ఇటీవల ఎస్సై జి.కళాధర్ సూచించారు. దీంతో స్పందించిన పాఠశాల యాజమాన్యాలు, వ్యాపారులు అంతా వీరఘట్టం పట్టణంలో 50 సీసీ కెమెరాలు ఏర్పా టు చేశారు. కెమెరాల ఏర్పాటుకు గతంలో ఎన్న డూ లేనివిధంగా ప్రజల నుంచి పూర్తి సహకా రం లభించిందని ఎస్సై తెలిపారు. ఎస్పీ ఆదేశా ల మేరకు వ్యాపారులు, ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించినట్లు చెప్పారు. ఈ మేరకు పలువురు వ్యాపారులతో ఎస్సై కళాధర్ శనివారం మాట్లాడారు. ఎటువంటి సమస్యలు న్నా.. అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా తమకు సమచారం ఇవ్వాలన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్...



మాట్లాడుతున్న ఎస్ఐ ఎం.రాజేష్

సీతానగరం: మండలంలోని జరుగుతున్న సైబర్ నేరాలు నివారణకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో కిరాణా సామగ్రి కోసం వచ్చిన మహిళలు, బ్యాంక్‌లో విత్‌డ్రా కోసం వచ్చిన బ్యాంక్ ఖాతాదారులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా లేకపోవడంతో మొబైల్ ఫోన్ వినియోగంలో వచ్చిన లోపాలు కారణంగా సైబర్ నేరాలు జరగడానికి, ఆన్‌లైన్ మోసాలు జరగడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు, సిబ్బంది బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.